సాక్షి పార్వతీపురం మన్యం

శనివారం । 25 । మార్చి । 2023



మహానటి..

పౌరాణిక నాటక ప్రదర్శనల్లో వెలిగిపోతున్న కిలారి లక్ష్మి తెలుగు రాష్ట్రాలతో పాటు చుట్టు పక్కల రాష్ట్రాలకు కూడా చిరపరిచితురాలు. - 8లో



అట్రాసిటి కేసుల్లో బాధితులకు న్యాయం

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో బాధితులకు న్యాయం జరగాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టం చేశారు. - 8లో



వైభవంగా సహస్ర దీపాలంకరణ

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామ స్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది - 8లో



మన్యం యువతకు సువర్ణావకాశం

- గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా పార్వతీపురం మన్యం జిల్లాతో ఏడు ఏంఓయూలు
- జిల్లాలో 4 స్కిల్ హబ్‌ల నిర్వహణ
- గుమ్మలక్ష్మీపురంలో ఆర్అండ్ఏసీ ఎస్టాబ్లేషన్ ల్యాబ్
- జిల్లాలో మరింత నిరుద్యోగ యువతకు ఉపాధి



స్కిల్ హబ్‌లలో శిక్షణ పొందుతున్న యువత

పార్వతీపురంటౌన్:

పార్వతీపురం మన్యం జిల్లా నిరుద్యోగ యువతకు శుభవార్త. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో భాగంగా జిల్లాలోని నిరుద్యోగ యువతకు వివిధ వృత్తి విద్యా కోర్సుల్లో నాణ్యమైన శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏడు సంస్థలు జిల్లా అధికారులతో ఎంఓయూ కదుర్చుకున్నాయి. ఇప్పటికే జిల్లాలో నిర్వహిస్తున్న నాలుగు నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో యువతకు మెరుగైన శిక్షణ ఇస్తాయి. వివిధ కంపెనీల అవసరాలకు అనుగుణంగా మానవ వనరులను తీర్చిదిద్దుతాయి. దీనివల్ల నిరుద్యోగ యువతకు ఉద్యోగాలు కల్పించాలన్న ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది. ఏజెన్సీ ప్రాంత యువతకు మంచి ఉద్యోగావకాశాలు లభిస్తాయని జిల్లా అధికారులు చెబుతున్నారు.



ఎంఓయూలు ఇలా..

స్కిల్ హబ్‌లలోని యువతకు మరింత మెరుగైన శిక్షణ అందిచేందుకు శ్రీరంగామోటార్స్, నోవిసింక్ సోల్యూషన్స్ ఇండియా ప్రైవేట్‌లిమిటెడ్, జయభేరి ఆటోమోటివ్స్ ప్రైవేట్ లిమిటెడ్, శ్రీ జగదీశ్వరి ఎంట ర్ ప్రైజెస్, ఎల్‌జీ ఎలక్ట్రానిక్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్, భరత్ ఎంటర్ ప్రైజెస్, మదర్ అండ్ ఫాద ర్ హోమ్ నర్సింగ్ సర్వీసెస్ సంస్థలు జిల్లా అధికారులతో ఒప్పందం కుదుర్చుకున్నాయి.

శిక్షణతో పాటు ఉద్యోగం

యువతలో నైపుణ్యాలను మెరుగుపరచి ఉపాధికి బాటలు వేసేందుకు రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ కృషి చేస్తోంది. పార్వతీపురం మన్యం జిల్లాలోని పార్వతీపురం, గుమ్మలక్ష్మీపురం, సీతంపేట, సాలూరు పాలిటెక్నిక్ కళాశాలల్లో ఏర్పాటుచేసిన నైపుణ్యాభివృద్ధి కేంద్రాల్లో యువతకు వివిధ ఉద్యోగ కోర్సుల్లో శిక్షణ తరగతులు నిర్వహిస్తోంది. 18 నుంచి 28 ఏళ్ల వయస్సులోపు యువతకు మూడు నెలలపాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ అవకాశాలను కల్పిస్తోంది.

గడిచిన ఐదు నెలల్లో జిల్లాలోని రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 మల్టీ నేషనల్ కంపెనీలు నిర్వహించిన జాబ్ మేళాల్లో 735 మంది నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయి. ఎస్పీ విద్యాసాగర్‌నాయుడు నేర నియంత్రణ ప్రేరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన జాబ్‌మేళాలో 850 మంది నిరుద్యోగ యువత ఉద్యోగాలు పొందారు. జిల్లాకు చెందిన సుమారు 1600 మంది నిరుద్యోగ యువతకు ఉపాధి లభించడంలో జిల్లా ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక యువతకు చక్కని ఉద్యోగ భవిష్యత్ లభిస్తోందని, దీనివల్ల ఆయా కుటుంబాలు ఆర్థికోన్నతి చెందుతున్నాయన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.

మంచి అవకాశం



ప్రభుత్వం నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే ధ్యేయంగా కృషి చేస్తోంది. ఇప్పటి వరకు జిల్లాలో నాలుగు స్కిల్ హబ్‌ల ద్వారా శిక్షణ అందజేస్తున్నాం. స్కిల్ హబ్‌లను మరింత అభివృద్ధి పథంలో తీసుకువచ్చేందుకు గ్లోబెల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్‌లో ఏడు కంపెనీలు ఎంఓయూ కుదుర్చుకున్నాయి. ఏడాదికి 500 మందికి ఉద్యోగ కల్పనే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించాం. నిరుద్యోగ యువత అంతా సమీప స్కిల్‌హబ్ సెంటర్లలో తమ వివరాలు నమోదు చేసుకుని శిక్షణ పొంది ఉద్యోగ అవకాశాలు పొందాలి. చిత్తశుద్ధితో విధులు నిర్వహించి ఉద్యోగాల్లో రాణించాలి.

– మనోజ్‌కుమార్, ప్లేస్‌మెంట్ అధికారి, పార్వతీపురం మన్యం

ప్రయోజనకరం



జిల్లాలోని నిరుద్యోగ యువతకు ఇదో సువర్ణావకాశం. కంపెనీల ఆధ్వర్యంలో స్కిల్‌హబ్‌లలో సాగే శిక్షణ తరగతులు యువతకు ప్రయోజనకరంగా మారనున్నాయి. చిన్న వయసులోనే మంచి ఉద్యోగాలు పొందే అవకాశం యువతకు లభిస్తుంది. ప్రభుత్వ సూచనలతో నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పనకు కృషి చేస్తున్నాం. ప్రస్తుతం జిల్లా యువతకు నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో 13 మల్టీనేషనల్ కంపెనీల్లో ఉద్యోగాలు కల్పిస్తున్నాం.

– యు.సాయికుమార్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, పార్వతీపురం మన్యం



నిరుద్యోగ యువతకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న వివిధ కంపెనీల ప్రతినిధులు (ఫైల్)

క్షయ పట్ల అప్రమత్తం

- జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్



సమావేశంలో మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్

పార్వతీపురం టౌన్:

క్షయ వ్యాధి పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జాయింట్ కలెక్టర్ ఒ.ఆనంద్ పిలుపునిచ్చారు. ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా కలెక్టర్ కార్యాలయం నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ కూడలి వరకు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్‌జీఓ హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్షయ అనేది గాలి ద్వారా వ్యాప్తి చెందే అంటు వ్యాధి అని, కోవిడ్‌తో పాటు క్షయ రోగం కూడా ఇబ్బంది కలిగించే సమస్యగా పేర్కొన్నారు. ప్రస్తుతం దేశంలో కోవిడ్ కేసులు పెరుగుతున్నాయని, వాటితో పాటు క్షయ కేసులు కూడా ఉన్నాయన్నారు. 2025 నాటికి టీబీని పూర్తిగా అంతం చేయాలని ఆరోగ్యశాఖ లక్ష్యంగా పెట్టుకుందని చెప్పారు. క్షయ వ్యాధిని చికిత్సతో తగ్గించే అవకాశం ఉందన్నారు. ఎక్కువ కాలం మందులు ఉపయోగించాలని, చికిత్సలో సాధారణంగా 6 నెలల యాంటీబయాటిక్స్ తీసుకోవాలని సూచించారు. చికిత్స సమయంలో ఆస్పత్రిలో చేరాల్సిన అవసరం లేదని ఇంటి వద్దనే ఉండి వ్యాధిని నయం చేసుకోవచ్చన్నారు. రోగనిరోధక శక్తిని పెంచే పోషకాహారం తీసుకోవడం వల్ల మరింత వేగంగా కోలుకోవచ్చని హితవు పలికారు. రెండువారాలకు మించి దగ్గు ఉంటే వైద్యపరీక్ష చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌ఓ డాక్టర్ బి. జగన్నాథరావు, జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ శ్యామ్‌కుమార్, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు వై వివేక్, శేషగిరిరావు, ఛాతీ వైద్యుడు దుర్గా ప్రసాద్, ధవళ భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

నేటి నుంచి ఆసరా విజయోత్సవ సభలు



గూగుల్ మీట్‌లో మాట్లాడుతున్న జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు

విజయనగరం గంటస్తంభం: అక్కచెల్లెమ్మలకు ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి ఆసరా పథకం కింద నిధులు విడుదల చేస్తున్న వేళ నియోజకవర్గ, మండల స్థాయిలో విజయోత్సవ సభలు నిర్వహించాలని జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు సూచించారు. జెడ్పీ సీఈఓ అశోక్‌కుమార్‌తో కలిసి మండల పరిషత్ అధికారులు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులతో శుక్రవారం గూగుల్ మీట్‌లో మాట్లాడారు. మూడోవిడత వైఎస్సార్ ఆసరా పథకం కింద విజయనగరం జిల్లాలో 3,92,623 మంది లబ్ధిదారులకు రూ.251.31 కోట్లు, పార్వతీపురం మన్యం జిల్లాలో 1,88,069 మంది మహిళలకు రూ.94.18 కోట్ల ఆర్థిక లబ్ధి చేకూరుసుందన్నారు. ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు ఈ నెల 25 నుంచి ఏప్రిల్ 5వ తేదీ వరకు అన్ని నియోజకవర్గ కేంద్రాలు, మండల కేంద్రాల్లో సభలు నిర్వహించాలన్నారు. సభలకు లబ్ధిదారులందరూ హాజరయ్యేలా చూడాలన్నారు. సచివాలయ కన్వీనర్లు, యువసారథులు పాల్గొనేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పథకం వల్ల కలిగే ప్రయోజనాలను లబ్ధిదారులకు తెలియజేసి ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలియజేసేలా చూడాలన్నారు. సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ కల్యాణచక్రవర్తి పాల్గొన్నారు.

పక్కుడుభద్రలో ఏనుగులు



పక్కుడుభద్ర జీడితోటల్లో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని పక్కుడుభద్రలో ఆరు ఏనుగుల గుంపు సంచరిస్తోంది. కాట్రగడ–బి వద్ద ఏబీ రోడ్డు పక్కన ఉన్న మొక్కజొన్న పంటను నాశనం చేశాయి. అనంతరం పక్కుడు భద్ర వద్ద జీడితోటల్లోకి చేరాయి. అటువైపుగా ఉపాధిహామీ పనుల కోసం వెళ్లిన వేతనదారులు ఏనుగులను చూసి పరుగుతీశారు.

సామూహిక కుంకుమపూజ



కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

మెంటాడ: మండలంలోని చింతాడవలస గ్రామంలో శ్రీరామనవమిని పురస్కరించుకుని శ్రీరామమందిరంలో శుక్రవారం సామూహిక కుంకుమపూజ నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్యామ్‌సుందర్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు జరిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గేదెల అన్నపూర్ణ భక్తులకు పూజా సామగ్రిని సమకూర్చారు.

జంతువుల పట్ల క్రూరత్వం తగదు

- సబ్ కలెక్టర్ నూరుల్‌కమర్



సమావేశంలో మాట్లాడుతున్న సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్

పాలకొండ రూరల్: జంతువుల పట్ల క్రూరత్వం పదర్శించడం తగతదని, వన్యప్రాణులను వేటాడితే చట్ట ప్రకారం శిక్షతప్పదని సబ్‌కలెక్టర్ నూరల్‌కమర్ హెచ్చరించారు. తన కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో మాట్లాడారు. సబ్ డివిజన్‌లో జంతు క్రూరత్వ నివారణ చట్టం సమర్థవంతంగా అమలు చేయాలని ఆదేశించారు. దీనికోసం ప్రత్యేక కమిటీలు ఏర్పాటుచేసేలా ప్రభుత్వం ఉత్వర్వులు జారీ చేసిందన్నారు. 1960 చట్టం మేరకు జంతువులను అక్రమంగా రవాణా చేయడం నేరమని పేర్కొన్నారు. జంతువుల జనన వివరాలు నమోదుచేయాలన్నారు. ప్రతి ఒక్కరూ వాటిపట్ల స్నేహభావనతో మెలగాలని, ఎటువంటి హాని తలపెట్టవద్దన్నారు. సమావేశంలో డీఎస్పీ జి.వి.కృష్ణారావు, పశుసంవర్థకశాఖ ఏడీ ప్రభామాణిక్యాలరావు, వెటర్నరీ సహాయ సర్జన్ బి.సిద్ధార్థ, కమిటీ సభ్యుడు, నగర కమిషనర్ ఎస్.సర్వేశ్వరరావు, సీఐ కె.మురళీధర్, డీఎల్‌పీఓ జె.రాంప్రసాద్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ ఎ.లావణ్య, సహాయ కార్మికశాఖ అధికారి కె.కిరణ్‌చంద్ర, దేవదాయశాఖ అధికారి ఎస్.రామారావు పాల్గొన్నారు.

పిల్లలు, గర్భిణులకు 'సంపూర్ణ పోషణ'

పార్వతీపురం: వైఎస్సార్ సంపూర్ణ పోషణ కింద సరఫరా చేస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలు, గర్భిణులకు అంగన్‌వాడీ కేంద్రాల్లోనే వడ్డించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. మహిళా శిశుసంక్షేమశాఖ ప్రాజెక్టు అధికారులతో శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. రక్తహీనతతో బాధపడుతున్న వారి సంఖ్య తగ్గించేందుకు అంగన్‌వాడీ కేంద్రాలు కీలకభూమిక పోషించాలన్నారు. సీతంపేట, కురుపాం, భద్రగిరి, పార్వతీపురం ప్రాజెక్టు పరిధిలో పిల్లలు, గర్భిణుల హాజరు తక్కువగా ఉందని, దీనిపై దృష్టిసారించాలని సూచించారు. పునరుత్పత్తి, చిన్నారుల ఆరోగ్య గుర్తింపుకార్డు (ఆర్‌సీహెచ్ ఐడీ) మ్యాపింగ్ ప్రక్రియను ఈ నెల 25 నాటికి పూర్తి చేయాలన్నారు. ఆరేళ్లలోపు వయస్సు గల పిల్లల ఆధార్‌కార్డులను శనివారం నాటికి అప్‌డేట్ చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో ఐసీడీఎస్ పీడీ కె.విజయగౌరి పాల్గొన్నారు.

గృహనిర్మాణాలు పూర్తి చేయడమే లక్ష్యం



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జిల్లాలో నిర్దేశించిన గృహనిర్మాణాలను మూడువారాల్లో పూర్తిచేయడమే లక్ష్యంగా ముందుకు సాగాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ ఆదేశించారు. గృహనిర్మాణాలపై జిల్లా అధికారులతో శుక్రవారం సమీక్షించారు. జిల్లాలో ఇప్పటికే 8,916 గృహాల నిర్మాణం పూర్తయిందని, మిగిలిన గృహాలు పూర్తి చేసేందుకు అన్నిశాఖల సమన్వయంతో పనిచేయాలన్నారు. ఆర్‌సీ స్థాయిలో ఉన్న నిర్మాణాలు, సొంత స్థలాల్లో చేపట్టిన ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలన్నారు. పొదుపు మహిళలకు రుణాలు మంజూరయ్యేలా చూడాలని డీఆర్‌డీఏ, మెప్మా అధికారులను ఆదేశించారు. సాలూరు, నెలిపర్తి లేఅవుట్లలో తక్షణమే స్తంభాలు వేయాలన్నారు. ఇంజినీరింగ్ సహాయకులు ప్రతిరోజు పర్యవేక్షించాలన్నారు. పాలకొండ, సాలూరు, పార్వతీపురం మున్సిపాల్టీ ప్రాంతాల్లో తాత్కాలికంగా నీటి కనెక్షన్లు ఇచ్చామని డీఈ కేజీఎస్ నర్సింగరావు తెలిపారు. సమావేశంలో హౌసింగ్ పీడీ పి.రఘురాం, డీఆర్‌డీఏ పీడీ టి.కిరణ్‌కుమార్, డుమా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ ప్రభాకరరావు, హౌసింగ్ ఈఈ రమేష్, మున్సిపల్ కమిషనర్లు జె.రామప్పలనాయుడు, హెచ్.శంకరరావు, ఎస్.సర్వేశ్వరరావు పాల్గొన్నారు.

ఇష్టంగా చదివితే ఉత్తమ ఫలితాలు



గురుకులంలో భోజనం రుచిచూస్తున్న జిల్లా కన్వీనర్ చంద్రావతి

భామిని: ఇష్టంగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఏపీఎస్‌డబ్ల్యూ గురుకులాల సమన్వయకర్త బి.చంద్రావతి పిలుపునిచ్చారు. మనోధైర్యంతో ముందుకు సాగాలని కోరారు. భామినిలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులాన్ని శుక్రవారం తనిఖీ చేశారు. పదో తరగతి బాలికలకు పరీక్షలు రాసేవిధానంపై తర్ఫీదునిచ్చారు. విద్యార్థినులకు వడ్డించిన భోజనాన్ని రుచిచూశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కె.విజయ నిర్మల, వైస్ ప్రిన్స్‌పాల్ సీహెచ్ రంగారావు, పీఎంసీ కమిటీ చైర్మన్ పి.వెంకటరమణ, బోధనా సిబ్బంది, విద్యార్థినులు పాల్గొన్నారు.

సూక్ష్మసేద్యం రైతుకు బాగు

జామి: సూక్ష్మసేద్యం రైతుకు లాభదాయకమని, తక్కువ నీరు, పెట్టుబడితో అధిక విస్తీర్ణంలో పంటలు సాగుచేయవచ్చని ఏపీఎంఐపీ (ఆంధ్రప్రదేశ్ మైక్రో ఇరిగేషన్) పీడీ పీఎన్‌వీ లక్ష్మీనారయణ తెలిపారు. మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన జి.లక్ష్మి, కొల్లు సత్యం తదితర రైతులు ఏర్పాటు చేసిన బిందు, తుంపర సేద్యం యూనిట్లను శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాకు 752.95 హెక్టార్లలో బిందు, తుంపర సేద్యం సాగుకు అవసరమైన యూనిట్లు మంజూరైనట్టు వెల్లడించారు. ప్రభుత్వం సన్న, చిన్నకారు రైతులకు 90 శాతం రాయితీపై యూనిట్లు సమకూర్చుతోందన్నారు. ఐదు ఎకరాల విస్తీర్ణం పైబడిన రైతులకు 55 శాతం రాయితీపై యూనిట్లు మంజూరు చేస్తున్నట్టు వెల్లడించారు. మామిడి, జీడిమామిడి, కొబ్బరి, ఆయిల్‌పాం, సపోట, జామ, చెరకు, కూరగాయల పంటలను సూక్ష్మసేద్యంలో సాగుచేయాలని సూచించారు.

పేద పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత విద్య

విజయనగరం ఫూల్‌బాగ్: రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు పేదకుటుంబాల పిల్లలకు ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం సీట్లు కేటాయించినట్టు కలెక్టర్ ఎ.సూర్యకుమారి తెలిపారు. విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(సి) ద్వారా 5 నుంచి 6 సంవత్సరాల వయసు కలిగిన పిల్లలకు ఒకటో తరగతిలో ఉచిత ప్రవేశాలు కల్పిస్తామని పేర్కొన్నారు. అర్హులైన విద్యార్థులు www.cre.ap.gov.in/QTE వెబ్‌సైట్‌లో గానీ, గ్రామ/వార్డు సచివాలయాల్లో ఉచితంగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈ నెల 22 నుంచి ఏప్రిల్ 10వ తేదీ వరకు ప్రవేశాల ప్రక్రియ కొనసాగుతుందని తెలిపారు. దీనిపై ఏమైనా సందేహాలుంటే ప్రభుత్వ టోల్‌ఫ్రీ నంబర్ 14417ను సంప్రదించాలన్నారు.

రాములోరి కల్యాణానికి తీపి సారె



తీపిపదార్థాలతో తయారు చేసిన చీర

శ్రీరామనవమిని పురస్కరించుకుని రామతీర్థం సీతారామస్వామి దేవస్థానంలో ఈ నెల 30న జరగనున్న సీతారాముల కల్యాణోత్సవంలో తీపి పదార్థాలతో తయారు చేసిన కంత (సారె) ప్రత్యేక ఆకర్షణగా నిలవనుంది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరానికి చెందిన మునకాల గోవిందరావు అనే భక్తుడు ఏటా వివిధ ఆకృతుల్లో సిద్ధంచేస్తున్న కంతను స్వామికి సమర్పిస్తూ వస్తున్నారు. ఈ ఏడాది కూడా తీపి పదార్థాలతో తయారుచేసిన చీర, అరటిపండ్లు, కొబ్బరికాయ తదితర వాటిని సిద్ధం చేశారు. రామతీర్థం సేవా సంఘం సభ్యుల ద్వారా ఆ రోజు స్వామివారికి సమర్పించనున్నారు.


– నెల్లిమర్ల రూరల్



అరటిపండ్లు



దంపుడు రోలు



తిరగలి



క్లుప్తంగా

గడప గపడకు పనులకు చెల్లింపులు



మాట్లాడుతున్న పీఆర్ ఇంజనీరింగ్ అధికారి కృష్ణాజీ

పార్వతీపురం: గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పూర్తిచేసిన పనులకు వెంటనే చెల్లింపులు జరుగుతున్నాయని పీఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్ కృష్ణాజీ తెలిపారు. ఈ మేరకు పీఆర్ ఇంజనీరింగ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన మాట్లాడుతూ పార్వతీపురం మన్యం జిల్లాలోని 15 మండలాల్లో గడప గడపకు మన ప్రభుత్వం నిధుల నుంచి గ్రామస్థాయిలో పనులు మంజూరు జరిగాయని, ఇంతవరకు జిల్లాలో 814 పనులకు రూ.19.08 కోట్లతో పరిపాలన, సాంకేతిక పరమైన ఆమోదాలు వచ్చినట్లు చెప్పారు. ఆ పనులకు గాను 667 మంది కాంట్రాక్టర్లను నియమించామన్నారు. 30 పనులకు టెండర్లు పూర్తయ్యాయని, కొన్ని పనులను నామినేషన్ పద్ధతిలో అప్పగించామని చెప్పారు. గ్రామ స్థాయి ప్రజాప్రతినిధులు వారి గ్రామాల్లో గడపగడపకు మన ప్రభుత్వం నిధులతో మంజూరైన సీసీ రోడ్లు, కాలువలు, రహదారులు వెంటనే పనులు పూర్తి చేసేందుకు సహకరించాలని కోరారు.

గిరిజన రైతు ఆత్మహత్య

పాచిపెంట: మండలంలోని కేరంగి పంచాయతీ కొండమోసూరులో పురుగు మందుతాగి గిరిజన రైతు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటనపై పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత ఏడాది వర్షాల కారణంగా గ్రామానికి చెందిన గిరిజన రైతు సోములు బోడియ్య జీడిమామిడి పంటకు నష్టం వాటిల్లింది. దీంతో అప్పటి నుంచి తీవ్ర మనస్తాపానికి గురై మద్యానికి బానిసయ్యాడు. మద్యం మత్తులో గురువారం ఉదయం పొలానికి వెళ్లి పురుగుమందు తాగాడు. ఈ విషయం తెలుసుకున్న భార్య, కుటుంబసభ్యులు సాలూరు సీహెచ్‌సీకి తీసుకువెళ్లగా పరిస్థితి విషమంగా ఉండడంతో విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతిచెందాడు.

మేకల మందపై కుక్కల దాడి

- ఎనిమిది పిల్లల మృతి



కుక్కల దాడిలో మరణించిన మేకలు

పాలకొండ:

పట్టణంలోని ఏలాం ప్రాంతంలో శుక్రవారం తెల్లవారుజామున కుక్కల గుంపు దాడి చేయడంతో ఎనిమిది మేకపిల్లలు మృతిచెందాయి. బాధితుడు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మేకల పెంపకం దారు జోలయ్య గురువారం రాత్రి తల్లి మేకలను ఒక చోట ఉంచి పిల్లలను వేరే పాకలో ఉంచారు. అర్ధరాత్రి దాటిన తరువాత కుక్కల గుంపు పిల్లలు ఉన్న పాకలోనికి చొరబడి వాటిని వెంటాడి ముక్కలు ముక్కలుగా చేశాయి. ఇంతలో వాటి అరుపులు విని వెళ్లిన జోలయ్య కుక్కల గుంపును తరిమేందుకుకు ప్రయత్నించగా ఆయనపై కూడా దాడిచేశాయి. దీంతో చుట్టుపక్కల వారిని పిలిచి కుక్కలను తరిమారు. అప్పటికే ఎనిమిది మేక పిల్లలు మృతిచెందగా మరి కొన్ని గాయాలపాలయ్యాయి. వాటికి స్థానిక పశువైద్య కేంద్రంలో చికిత్స చేశారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 420.00
విజయనగరం	రూ. 424.00
శ్రీకాకుళం	రూ. 424.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24కి. 10గ్రా.)	56,150-00
బంగారం(22కి. 10గ్రా.)	51,800-00
వెండి (కిలో)	71,200-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹110	₹190	₹ 200

మహానటి..

ఆమె పేరు వినగానే పౌరాణిక రంగ స్థల ప్రేక్షకుల మది పులకిస్తుంది. ఆమె నటించే పౌరాణిక నాటకాల్లోని పాత్రలు చూసేందుకు ప్రేక్షకులు ఎగబడతారు. టెక్నాలజీ వచ్చి సినిమాలు అందుబాటులోకి వచ్చినా ఇప్పటికీ గ్రామాల్లో పౌరాణిక నాటకాలకు ఆదరణ కొనసాగుతూనే ఉంది. మూడు తరాల కళాకారులతో నటించిన ఆమె గాత్ర మాధుర్యం, నటనాభినయం అద్భుతం. పురుష కళాకారులను అధిగమిస్తూ పౌరాణిక రంగస్థలంలో ఇప్పటికీ తరగని ఆదరణ సొంతంచేసుకుని కళారంగానికి వన్నెతెస్తున్న కళాకారిణి కిలారి లక్ష్మి. ఆమె స్వగ్రామం రాజాం. ఆరువేలకు పైగా పౌరాణిక కళా ప్రదర్శనలు ఇచ్చిన ఆమె పలు సత్కారాలు పొంది, ప్రేక్షకుల మదిలో మహానటిగా స్థానం సంపాదించింది.

-రాజాం



శ్రీకృష్ణుడి పాత్రలో కిలారి లక్ష్మి

- పౌరాణిక నాటకాల్లో పురుష వేషధారణలో రాణింపు
- 27 సంవత్సరాలుగా నాటకరంగంలో సేవలు
- 6వేలకు పైగా ప్రదర్శనలు
- పలు రాష్ట్రాల్లో గుర్తింపు
- శ్రీరాముడిగా, అర్జునుడిగా పాత్రలో పరకాయ ప్రవేశం

పౌరాణిక నాటక ప్రదర్శనల్లో వెలిగిపోతున్న కిలారి లక్ష్మి తెలుగు రాష్ట్రాలతో పాటు చుట్టు పక్కల రాష్ట్రాలకు కూడా చిరపరిచితురాలు. సాధారణ కుటుంబం నుంచి వచ్చిన ఆమె చిన్నతనం నుంచే కళా ప్రదర్శనలు ఇచ్చేది. ఆడపిల్ల స్టేజీలపై ప్రదర్శన లేమిటని ప్రశ్నించినవారికి ఆదర్శ మహిళగా నిరూపించింది. తల్లిదండ్రులు ఆమెపై ఉంచిన నమ్మకాన్ని నిజంచేసేందుకు తన నటనకు కొత్త హంగులు దిద్దింది. పౌరాణిక నాటకాల్లో ఉండే స్త్రీ పాత్రలే కాకుండా ఏకంగా పురుష పాత్రలు పోషించేది. ఔరా అనిపించేలా దేశవ్యాప్తంగా గుర్తింపు తెచ్చుకుంది. పౌరాణిక నాటకాల్లో అర్జునుడు, రాముడు, సత్యహరిశ్చంద్రుడు పాత్రలు వేసి అందరినీ మెప్పించింది. ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలోని కొత్తూరు మండలం గూనభద్ర ఆమె జన్మస్థలం. తల్లిదండ్రులు లలితాదేవి, సత్యనారాయణలు కూడా కళాకారులే. వారిద్దరి దగ్గర అల్లారుముద్దుగా పెరిగిన లక్ష్మి నాటకాలపై మమకారం పెంచుకుని చిన్నతనంలోనే తల్లిదండ్రులతో పాటు లవకుశ పాత్రల్లోనూ, లోహితాస్యుడు పాత్రలోనూ నటించేది.

తొలి అడుగు రాజాం నుంచే..

ఇంటర్మీడియట్ చదువుతో సరిపెట్టుకున్న లక్ష్మి నాటకాలవైపు దృష్టి సారించి, ఆరంభంలోనే పెద్ద పెద్ద కళాకారులతో నటించేది. ఆమె తొలి నాటక ప్రదర్శన రాజాం మండలం శ్యాంపురం గ్రామంలో జరిగింది. అక్కడ గ్రామ దేవత సంబరాల్లో సత్యహరిశ్చంద్ర నాటకంలో చంద్రమతిగా తొలి పద్యనాటక ప్రదర్శన ఇచ్చింది. వేలాదిమంది ఆరోజు అక్కడకు రాగా, చంద్రమతిగా పాత్రలో పరకాయప్రవేశం చేసి ఆద్యంతం కేరింతలు, చప్పట్లతో ప్రేక్షకుల మనసును గెలిచి తెలుగురాష్ట్రాల్లో తన పేరు మార్మోగేలా చేసింది.

కుటుంబసభ్యుల ప్రోత్సాహం

కిలారి లక్ష్మిలో పట్టుదల ఒక ఎత్తుకాగా, ఆమె భర్త చంటిబాబు సహకారం మరో కారణం. వివాహమైనంత వరకు చంద్రమతి పాత్రలు ఎక్కువగా పోషించిన ఆమె..భర్త ప్రోత్సాహంతో శ్రీరాముడు, కృష్ణుడు, అర్జునుడు పాత్రలు వేయడం ప్రారంభించింది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు తెలంగాణ, ఒడిశా, మద్రాస్ ప్రాంతాల్లో కూడా ఆమె అభినయం మంచి పేరును తెచ్చిపెట్టింది.



శ్రీరాముడిగా రంగస్థలంపై అభినయం

ఆరువేలకు పైగా ప్రదర్శనలు

ఎప్పుడో 27 సంవత్సరాల క్రితం స్టేజీపై అడుగుపెట్టిన లక్ష్మి ఇప్పటికీ నటనా జీవితాన్ని కొనసాగిస్తూనే వస్తోంది. తన గాత్రంపైనే నమ్మకం పెట్టుకున్న ఆమె ఇప్పటివరకూ 6 వేలకు పైగా నాటక ప్రదర్శనలు ఇచ్చింది. ఆమె ప్రస్తుతం రాజాంలోని వస్త్రపురికాలనీలో ఉంటున్నారు. ప్రదర్శన ఇచ్చిన ప్రతిచోటా ఆమెకు సత్కారాలు లభించాయి. నటగాన శిరోమణి, అభినవ చంద్రమతి, అభినవ సావిత్రి బిరుదులతో పాటు సువర్ణ ఘంటా కంకణం, 2016లో వెండి కిరీటం ఉత్తరాంధ్ర కళాకారులు బహుకరించారు. 2016లో కదుకూరి పురస్కారం లభించగా, నంది నాటక అవార్డులకు న్యాయ నిర్ణేతగా కూడా ఆమె వ్యవహరించారు.

పట్టుదల ఉండాలి



ప్రతి ఒక్కరికి ఏదో ఒక ప్రతిభఉంటుంది. పట్టుదలతో ప్రయత్నిస్తే అది సొంతమవుతుంది. నాకు ఆరంభంలో అవమానాలు ఎదురయ్యాయి. నా భర్తతో పాటు కుటుంబసభ్యులు ప్రోత్సహించారు. నా గాత్రాన్ని, ప్రతిభను నమ్మాను. దేవుడు కరుణించాడు. ప్రేక్షకులు ఆదరించారు. తెలుగు పౌరాణిక రంగస్థల చరిత్రలో కిలారి లక్ష్మి పేరుకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ జన్మకు ఇది చాలు.

కిలారి లక్ష్మి, పౌరాణిక రంగస్థల కళాకారిణి

కళాకారులకు ఆహ్వానం

రాజాం: పీపుల్ మీడియా ఫ్యాక్టరీ, సినిమా ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ స్థానిక తృప్తిరిసార్ట్‌లో ఈనెల 25, 26 తేదీల్లో ఆడిషన్స్ నిర్వహిస్తున్నట్లు రిసార్ట్ ఎం.డి పీవీజీ కృష్ణ(మురళీమా స్టార్) శుక్రవారం తెలిపారు. 1971వ సంవత్సరం నేపథ్యంలోని వృత్తాంతంతో పిరియాడ సినిమా శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లో నిర్మిస్తున్నట్లు వెల్లడించారు. ఈ సినిమాలో ప్రధాన పాత్రధారులు మినహా మిగిలిన పాత్రలన్నింటికీ స్థానిక ఉత్తరాంధ్ర కళాకారులను తీసుకుంటున్నట్లు వివరించారు. 200 మందికి పైగా కళాకారులను ఈ సినిమాకు ఎంపికచేయనున్నట్లు తెలిపారు. కోవిడ్ తరువాత రిసార్ట్‌లో 12 కి పైగా సినిమాలు షూటింగ్ జరిగినట్లు చెప్పారు. గతంలో పీపుల్ మీడియా ఫ్యాక్టరీ కార్తికేయ-2, ధమాకా వంటి సినిమాలు నిర్మించిందన్నారు. అటువంటి సంస్థ ఈ రిసార్ట్‌లో ఆడిషన్స్ చేయడం, ఈ ప్రాంత కళాకారులకు అవకాశం కల్పించడం ఆనందించదగ్గ విషయమని వివరించారు. ఆసక్తి ఉన్న కళాకారులు ఈనెల 25, 26 తేదీల్లో రిసార్ట్‌లో జరిగే ఆడిషన్స్‌కు హాజరుకావాలని సూచించారు.

61 మద్యం సీసాలు స్వాధీనం



మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్న పోలీసులు

కొత్తవలస: మండలంలోని వీరభద్రపురం గ్రామంలో నిబంధనలకు వ్యతిరేకంగా నిర్వహిస్తున్న మద్యం బెల్టుషాపుపై ఎస్సై బొడ్డు దేవి తన సిబ్బందితో శుక్రవారం దాడి చేసి మద్యం విక్రయిస్తున్న కె.సంతోష్‌ను అదుపులోకి తీసుకొని 61 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై దేవి తెలిపారు. గ్రామాల్లో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్లు ఆమె తెలిపారు.

అట్రాసిటి కేసుల్లో బాధితులకు న్యాయం

- కలెక్టర్ ఎ.సూర్యకుమారి
- విజిలెన్స్ కమిటీ సమావేశంలో సమస్యలపై చర్చ



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ సూర్యకుమారి

విజయనగరం అర్బన్: ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసుల్లో బాధితులకు న్యాయం జరగాలని కలెక్టర్ ఎ.సూర్యకుమారి స్పష్టం చేశారు. అట్రాసిటి చట్టం కింద నమోదు చేసిన కేసుల్లో విచారణ వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం కలెక్టర్ ఆడిటోరియంలో శుక్రవారం జరిగింది. గత ఏడాది ఆగస్టు నుంచి ఈ ఏడాది ఫిబ్రవరి నెలాఖరు వరకు నమోదైన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటి కేసులపై గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలుపై చర్చించారు. మొత్తం 48 కేసులు నమోదు కాగా ఆయా డీఎస్పీల పరిధిలో ఉన్న కేసులపై సమీక్షించారు. పెండింగ్ కేసుల్లో సమగ్ర విచారణ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ సూర్యకుమారి మాట్లాడుతూ బాధితులకు తక్షణ పరిహారాన్ని అందించాలని స్పష్టం చేశారు. కేసుల్లో బాధితులకు బెదిరింపులు వస్తే, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని సూచించారు. జాతావు తెగకు చెందిన కేసుల్లో బాధితుల బాధ తెలుసుకునేందుకు భాషా అనువాదకులను నియమించి కోర్టుకు పంపించాలని చెప్పారు. కేసుల నమోదుకు అవసరమైన మెడికల్ సర్టిఫికెట్లను త్వరగా మంజూరు చేయాలన్నారు.

బాల్య వివాహాలు వద్దు

కమిటీ సభ్యులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ చదువు అవసరమని ఆడ పిల్లలను కూడా కనీసం డిగ్రీ వరకు చదివించేందుకు కృషి చేయాలని కోరారు. బాల్యవివాహాలు జరగకుండా చూడాలన్నారు. చిన్నతనంలోనే వివాహం చేస్తే వారి శారీరక ఎదుగుదల సక్రమంగా ఉండదని అలాంటి స్థితిలో గర్భం దాల్చడం ఒక్కోసారి ప్రాణాంతకమవుతుందని పేర్కొన్నారు. ఎట్టి పరిస్థితుల్లోనూ గర్భిణులు, శిశువులను వైద్యం కోసం ఆర్ఎంపీ వైద్యులకు చూపించవద్దని స్పష్టం చేశారు. దీనివల్ల వ్యాధి ముదిరి తల్లీ పిల్లలు ప్రాణాలు కోల్పోయిన సంఘటనలు తమ దృష్టికి వచ్చాయని చెప్పారు. కమిటీ సభ్యులు సమావేశంలో ప్రస్తావించిన కొన్ని సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ హామీ ఇచ్చారు. జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతిరావు మాట్లాడుతూ ఈ ఏడు నెలల కాలంలో 55 కేసుల్లో సుమారు రూ.1,10,50,000 పరిహారం కింద అందజేసినట్లు తెలిపారు. సమావేశంలో సాంఘిక సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ పి.రత్నం, వివిధ శాఖల అధికారులు, డీఎస్పీలు, తహసీల్దార్‌లు, విజిలెన్స్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ

నెల్లిమర్ల రూరల్:

సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం రామతీర్థంలోని శ్రీ సీతారామస్వామి దేవస్థానంలో సహస్ర దీపాలంకరణ సేవ శుక్రవారం అత్యంత వైభవంగా జరిగింది. అర్చకులు వేకువ జామున స్వామికి ప్రాతఃకాలార్చన, బాలభోగం నిర్వహించిన తరువాత యాగశాలలో ప్రత్యేక హోమాలు జరిపించారు. అనంతరం స్వామి వెండి మంటపం వద్ద నిత్య పూజలు కొనసాగించారు. సాయంత్రం సీతారామ చంద్రస్వామిని నూతన పట్టు వస్త్రాలతో సుందరంగా అలంకరించి తూర్పు రాజగోపురం వద్దనున్న ప్రాంగణ వేదికపై ప్రత్యేక ఊయలలో ఆశీనులను చేశారు. అనంతరం దీపాలంకరణ వేడుక ప్రారంభించారు. వేద మంత్రోచ్చారణ నడుమ ప్రత్యేక ఊయలలో స్వామి వారిని వేంచేపు చేసి ఊంజల్ సేవ జరిపించారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



సీతారామస్వామిని పల్లకిలో తీసుకువస్తున్న భక్తులు



స్వామి సన్నిధిలో దీపాలను వెలిగిస్తున్న భక్తులు

విద్యార్థిని అదృశ్యంపై దర్యాప్తు



దర్యాప్తు చేస్తున్న బాలికా సంరక్షణ అధికారి రోజారమణి

గరుగుబిల్లి: మండలంలోని రావివలస కేజీబీవీ పాఠశాలలో చదువుతున్న విద్యార్థిని అదృశ్యంపై డీఈఓ ఎస్‌డీవీ రమణ దర్యాప్తుకు ఆదేశించారు. ఈ మేరకు జిల్లా అదనపు బాలికా సంరక్షణ అధికారి కె.రోజారమణి శుక్రవారం కేజీబీవీ పాఠశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.ఛాయా దేవినుంచి సమాచారం సేకరించారు. విద్యార్థిని ప్రవర్తన, పాఠశాలలో సిబ్బంది వ్యవహరించిన తీరు తదితర అంశాలపై తెలుసుకున్నారు. అనంతరం బాలికా సంరక్షణ అధికారి మాట్లాడుతూ విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించిన నైట్‌వాచ్‌ఉమన్ జ్యోతిపై సస్పెన్షన్ వేటు వేయడంతో పాటు ప్రిన్సిపాల్‌కు షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. తదుపరి చర్యల నిమిత్తం ఉన్నతాధికారులకు నివేదిక సమర్పిస్తామని చెప్పారు.

అదృశ్యంపై కేసు నమోదు

పాఠశాల విద్యార్థిని అదృశ్యంపై ప్రిన్సిపాల్ ఛాయాదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎం.రాజేష్ తెలిపారు.

ఆరోగ్య కార్యక్రమాలు ప్రజల చెంతకు చేరాలి

- డీఎంహెచ్‌ఓ బి.జగన్నాథ రావు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు

పార్వతీపురంటౌన్: ఆరోగ్య కార్యక్రమాలు ప్రజల చెంతకు చేరాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ బి.జగన్నాథ రావు ఆదేశించారు. ఆరోగ్య కార్యక్రమాలు, సంబంధిత యాప్‌లపై వైద్యాధికారులకు శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ ఆరోగ్య కార్యక్రమం, సంబంధిత వైద్యసేవలు ప్రజలకు అందాలని సూచించారు. అందుకు ఈ శిక్షణ ఉపయోగపడుతుం దన్నారు. ఆరోగ్య యాప్‌లలో రోగుల వివరాలు నమోదు చేయాలని కోరారు.

మాతృ మరణాలపై సమీక్ష

2022 నవంబరు నుంచి 2023 జనవరి వరకు జరిగిన మూడు మాతృ మరణాలపై డీఎంహెచ్‌ఓ సమీక్ష నిర్వహించారు. తాడికొండ పీహెచ్‌సీ పరిధి పెదఖర్జ, జియ్యమ్మవలస పీహెచ్‌సీ పరిధి బాసంగి, సీతంపేట మండలం మర్రిపాడు పీహెచ్‌సీ పరిధి రేగులగూడలో మరణాలు సంభవించాయన్నారు. హైరిస్క్ గర్భిణులను ముందుగా గుర్తించి చక్కని ప్రణాళికతో ప్రసవానికి ముందుగానే ఆస్పత్రిలో చేర్చడం, స్త్రీ వైద్య నిపుణులతో పరీక్షలు విధిగా జరగాలని ఆయన ఆదేశించారు. గర్భిణుల ఆరోగ్యం నిరంతరం పర్యవేక్షించాలని ఆశ కార్యకర్తలు, ఏఎన్ఎంలను ఆదేశించారు. వైద్య సేవలు అందించడంలో ఉన్న సంతృప్తిని ప్రతి ఒక్కరూ పొందాలని కోరారు. సమావేశంలో డీఐఓ జగన్మోహనరావు, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.విజయ పార్వతి, ఐటీడీఏ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జి.వెంకటరమణ, గైనకాలజిస్ట్ డాక్టర్ బి.కమల కుమారి, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ జగన్‌మోహన్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ ఎం.వినోద్, వైద్యాధికారులు, పర్యవేక్షకులు తదితరులు పాల్గొన్నారు.

8 మంది డీబార్

విజయనగరం పూల్‌బాగ్: ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం (మ్యాథ్స్-2బి, జువాలజీ-2, హిస్టరీ-2పేపర్) పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 24,795 మంది విద్యార్థులు హాజరయ్యారు. వారిలో మాల్‌ప్రాక్టీసుకు పాల్పడిన 8 మంది విద్యార్థులను డీబార్ చేసినట్లు ఆర్ఐఓ ఎం.సత్యనారాయణ శుక్రవారం తెలిపారు. ఇంటర్మీడియట్ జనరల్ పరీక్షకు 20206 మంది హాజరు కావాల్సి ఉండగా, 19484 మంది హాజరయ్యారు. ఒకేషనల్ పరీక్షకు 4589 మంది హాజరు కావాల్సి ఉండగా, 4295 మంది మాత్రమే హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్ఐఓ మూడు పరీక్షా కేంద్రాలను, డీఈసీ మూడు కేంద్రాలను తనిఖీ చేశారు. స్క్వాడ్ బృందాలు 42, ఇతర అధికారులు 8 కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.

నీరే జీవనాధారం..

- ఎఫ్‌టీసీ అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ త్రినాథస్వామి



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎఫ్‌టీసీ అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ త్రినాథస్వామి

డెంకాడ: నీరు జీవనధారమని ఎఫ్‌టీసీ అగ్రికల్చర్ డిప్యూటీ డైరెక్టర్ (శ్రీకాకుళం) కె.త్రినాథస్వామి అన్నారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకుని చింతలవలస ఎంవీజీఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో కళాశాల సివిల్ ఇంజినీరింగ్ విభాగం, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో 'మార్పును వేగవంతం చేయండి' అనే నినాదంతో కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన త్రినాథస్వామి మాట్లాడుతూ, జీవరాశులతో పాటు పంటలకు నీరే ప్రధానమన్నారు. నీటిని సరైన పద్ధతిలో వృథా కాకుండా వినియోగించి భూగర్భ జలాలను పెంచాలని సూచించారు. మినుములు, తృణధాన్యాలను తక్కువ నీటితో పండించవచ్చన్నారు. ప్రతి ఒక్కరూ దైనందిన జీవితంలో మినుములు తప్పనిసరిగా తీసుకుకోవాలన్నారు. సేంద్రియ పద్ధతుల్లో వ్యవసాయం చేయాలని సూచించారు. ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ బి.ఉమాశంకర్ మాట్లాడుతూ, 2024 సంవత్సరం నాటికి అన్ని గ్రామాల్లోని ఇళ్లకు కుళాయి కనెక్షన్లు అందించేందుకు పనులు ముమ్మరంగా చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బి.రఘువీరా, వైస్ ప్రిన్సిపాల్ పి.రంగరాజు, ఎన్ఎస్ఎస్ పీఓ ఎన్.షణ్ముఖరావు, హెచ్ఓడీ పి.మార్కండేయరాజు, అధ్యాపకులు ఎస్.చంద్రమౌళి, సీహెచ్‌వీ రవిశంకర్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాక్షి క్లాసిఫైడ్స్

PLOT FOR SALE

■ విజయనగరం టౌన్, జమ్ము దగ్గర ఆంధ్రబ్యాంకు ఎదురుగా VMRDA (AP RERA) Aproved Housing Project BT 40ft roads, 3 Face power Spot Registrations 80% Bank Loan మిని Gated Community Layout. Cell:9143143818 [S-1154259]

■ VMRDA 167 Sq.yds. (East) Surya Eastates (Sai Villa-1) Bypass 200 ft. Road Korukonda, VZM (Ramanarayana Temple) MNR - 93931 20181, 76758 73076 [V-11529]

PLOTS & VILLAS FOR SALE

■ విజయనగరం నుండి రాయపూర్ కొత్త నేషనల్ హైవేకి ఆనుకొని సూర్యవారి నూతన గేటెడ్ కమ్యూనిటీ లే అవుట్‌లో అద్భుతమైన డెవలప్‌మెంట్స్‌తో ఓపెన్ ప్లాట్స్ & లగ్జరీ విల్లాస్ వుడా అప్రూవుడ్‌తో అమ్మకానికి కలవు. ఫోన్: 63013 06593 [V- 5657]

LAND FOR SALE

■ For Sale 163 Acres Single-Bit prime Land, Clear Title, Road-facing. Close to Vijayawada - Nagpur Expressway, Excellent Environment for Living, Business and agriculture, High iron soil. Nawabpet(V), Chityala(M), Bhupalpally(D). Contact : 7675868777, 9390085828. info@amodagroup.com [HA-26365]

BUSINESS OFFER

■ Capro కంపెనీ ప్రొవైడ్ అన్ని రకములైన బిజినెస్ ప్రాపర్టీ ప్రాజెక్టు కొరకు LAP & Agent's కావలెను, మంచి జీతం + కమీషన్. ✆ 9319814720. [T-1196145]

డిస్ట్రిబ్యూటర్స్ కావలెను

■ ఎక్కువధర మెషినుతోవచ్చే TDS, ఆల్కలైన్, AO, - ORPలతో కూడిన మంచి నీటిని చాలా తక్కువధర ప్రొడక్టుతో ప్రతిఇంటికీ ఇచ్చేందుకు డీలర్స్ కావాలి. ✆ 77993 57879 [O-759018]

SERVICES

■ పర్సనల్, బిజినెస్,ప్రాపర్టీ, ల్యాండ్స్ & వ్యవసాయ భూములపై మార్టిగేజ్ చేసుకొని అతి తక్కువ వడ్డీకి వారం రోజులలో రుణంఇవ్వబడును. ఏజెంట్స్ కావలెను. 8598800260, 8901923173. [T-1783]

WANTED

■ ప్రముఖ సంస్థ నందు మీ ఇంటి దగ్గర ఉంటూ పార్ట్/ఫుల్‌టైం పోస్టల్ కవర్లపై అడ్రస్‌లు వ్రాయుటకు స్త్రీ/పురుషులు కావలెను. జీతం: 15000+ ఇన్సెంటివ్స్. ఫ్రీ బుక్‌లెట్ కొరకు 9059509586 [G-795249]

■ URGENT REQUIREMENT AT GUDUR for Manufacturing Company. Drivers-05, Fitters-12, Welder-12 and Business Development Associate-10 (Any Graduate). Please Mail us at : job.gdrp@gmail.com [N-1226002]

■ MEGA GROUP MAN POWER & Security సంస్థ విస్తరణలో భాగంగా AP & TS లలో జిల్లాల వారీగా ఈ ఫీల్డ్‌లో అనుభవమున్న వారికి ఫ్రాంఛైజ్ ఇవ్వబడును. (పెట్టుబడి లేదు). సెల్ : 70326 10569, 70931 25169. [NA-5449]

■ VIP's ఇంట్లో పేషెంట్‌ని చూసుకోడానికి స్త్రీలు/పురుషులు అర్జెంటుగా కావలెను.ఆయా,వార్డ్ బాయ్స్ ,నర్సులు, వంటవారు, RMP. Dr. Q:5th- డిగ్రీ, 10-30వేలు జీతం. భో+రూం ఫ్రీ. Hyd. 7993583999 [HA-1124]

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఫ్రీ వసతి+భోజనం. జీతం: 16K-18K. విజయవాడ. Ph: 9640528899, 9640648899 [HA-1117]

■ Wanted Office Executives 2No's for a Reputed Company at Vizag. Contact : 90143 92247, Mail id : admin@surabhiinfra.com [V- 10354]

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.